క్లుప్తంగా

వైభవంగా విగ్రహాల ప్రతిష్టాపన



పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : మండల పరిధిలోని గవిగట్టు గ్రామంలో బంగారమ్మదేవి, మారెమ్మదేవి నూతన శిలా విగ్రహాల ప్రతిష్టాపన బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు గావించారు. 9 గంటలకు నూతన శిలా మూర్తులకు ప్రాణప్రతిష్ఠ గావించారు. అనంతరం పూర్ణాహుతి, నాకబలి తదితర ప్రత్యేక పూజలు చేపట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్టాపన వేడుకలలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యులు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి పాల్గొని మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగరాజు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

గణేకల్‌లో బంగారమ్మవ్వ ఉత్సవాలు



కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న మహిళలు, యువతులు

ఆదోని రూరల్: మండలంలోని గణేకల్ గ్రామంలో బుధవారం బంగారమ్మవ్వ దేవర ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని దేవమ్మవ్వ, లక్ష్మమ్మవ్వ, సుంకులమ్మవ్వ, బంగారమ్మవ్వ ఆలయాలకు భక్తులు కలశాలతో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవార్లకు కుంభాల్లో నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవర మహోత్సవంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ఉరుకుందలో సుదర్శన హోమం



ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద ఈనెల 26న సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఈ హోమంలో పాల్గొనదలచిన వారు ముందుగానే రూ.1500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీ కోరారు. స్వాతి నక్షత్రం సందర్భంగా దేవస్థానంలో ఈ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులకు దేవస్థానం తరుపున పాల్గొన్న వారికి శేషవస్త్రం, రవిక, స్వామివారి ఫోటో, దేవాస్థానం పేరున్న బ్యాగ్, దేవస్థానం రెండు లడ్డూలున్న బాక్స్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

నేడు జొహరాపురంలో రెవెన్యూ సదస్సు

నందవరం : మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..రైతులు భూ సమస్యలపై గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని, రైతులు భూ సమస్యలు అర్జీల రూపంలో అందిస్తే పరిష్కారం చూపుతామన్నారు.

బైక్ ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామానికి వెళ్లేదారిలో బుధవారం సాయంత్రం బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు అయ్యాయి. పట్టణానికి చెందిన కుమార్ అనే వ్యక్తి బైక్‌పై గుడేకల్ గ్రామానికి వెళ్లి తిరిగి పట్టణానికి వస్తుండగా అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు, శరీర భాగాలపై గాయాలు కావటంతో చికిత్స కోసం 108లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

నందవరం : మండలంలో గురువారం నుంచి నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను విద్యార్థులు, చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పుల్లయ్య అన్నారు. గురువారం 26వ తేదీన పూలచింత, కే.పేట, ముగతి, గురజాల గ్రామాలలోని సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 27న మాచాపురం, ముగతి, హాలహర్వి, పెద్దకొత్తిలి, నాగలదిన్నె, 28న నాగలదిన్నె, నందవరం, కనకవీడు గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు.





ఆర్‌సీఎం చర్చిలో వాక్యోపదేశం చేస్తున్న ఫాదర్ కోలా విజయ కుమార్, సీఎస్ఐ బిషప్ రెవ. హైజక్ వర ప్రసాద్‌ను సన్మానిస్తున్న సంఘస్తులు



చింతకుంటలో బోధిస్తున్న పాస్టర్ ప్రేమ్‌కుమార్



ఆదోని సీఎస్ఐ చర్చిలో భక్తి గీతాలను ఆలపిస్తున్న భక్తులు





పెద్దకడబూరు ఆర్‌సీఎం చర్చిలో దైవ సందేశం వినిపిస్తున్న ఫాదర్ రెవరెండ్ సంజీవరావు, ఆదోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

క్రీస్తు మార్గంలో నడుద్దాం

- ఘనంగా క్రిస్మస్ వేడుకలు
- చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు

ఆదోని సెంట్రల్: క్రిస్మస్ అంటేనే ప్రేమ అని ఏసు ప్రభువు చూపిన మార్గంలో నిడిచి ఇతరుల పట్ల దయ, ప్రేమ, కరుణ చూపాలని సీఎస్ఐ బిషప్ రెవ. హైజక్ వర ప్రసాద్ అన్నారు. క్రిస్మస్ పండుగను క్రైస్తవులు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సీఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చిలో సీఎస్ఐ బిషప్ రెవ. హైజక్ వర ప్రసాద్, పాస్టర్ హెరాల్డ్ భరత్, పరిశుద్ధ బాల యేసు మందిరంలో ఫాదర్ కోల విజయ కుమార్, సీఎస్ఐ చర్చిలో పాస్టర్ విలియం, సీయోను ప్రార్థన మందిరంలో బ్రదర్ తిమోతి, పట్టణంలో హోసన్న మందిరం, ఎంబీఎం చర్చి, బెతేలు ప్రార్థన మందిరంతో పాటు పలు చర్చిల్లో ఫాదర్లు దైవ సందేశం వినిపించారు. సీఎస్ఐ బిషప్ మాట్లాడుతూ మానవులను పాపము నుంచి విముక్తి కలిగించడానికి ఏసుక్రీస్తు మానవుడిగా జన్మించారన్నారు. వారి జననంతో సర్వమానవాళికి వెలుగు వచ్చిందన్నారు. ఆయన చేసిన బోధనలే మనలను సన్మార్గంలో నడిపిస్తాయని గుర్తు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు క్రిస్మస్ శుభాకాంక్షలను తెలుపుకున్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ఆదోని అర్బన్: క్రిస్మస్ పండగ సందర్భంగా బుధవారం ఆదోని పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతాశిశు సంరక్షణ కేంద్రంలోని రోగులకు, బాలింతలకు, గర్భిణులకు పాస్టర్ విక్టర్ పాల్ ఫిలిప్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ప్రతి ఒక్కరూ యేసుక్రీస్తు అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సయ్యోను, భరత్, సుగుణరావు, రాజు, రూఫస్, సంజయ్, రూతమ్మ, వినయ, మణి తదితరులు పాల్గొన్నారు.



గోనెగండ్ల ఎఫ్రాత మందిరంలో సందేశం ఇస్తున్న సేవకుడు యదిద్య రాజు



ఎమ్మిగనూరులో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

పెద్దకడబూరు : ప్రతి ఒక్కరూ యేసు బోధించిన శాంతి మార్గంలో నడవాలని సీఎస్ఐ చర్చ్ పాస్టర్ ముత్తు మనోహర్‌బాబు, ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ రెవరెండ్ సంజీవరావు అన్నారు. బుధవారం యేసు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని హెచ్.మురవణి, జాలవాడి, కంబదహాళ్, కంబళదిన్నె, కల్లుకుంట, చిన్నతుంభళం, మేకడోణ, బసలదొడ్డి, పెద్దకడబూరు తదితర గ్రామాలలో కేక్‌లను కట్‌చేసి క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెద్దకడబూరులో తెల్లవారు జాము నుంచి పురవీధుల గుండా భక్తి గీతాలతో ఊరేగుతూ ప్రతి ఇంటిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఆయా చర్చీల్లో ప్రార్థనలు చేశారు.

కోసిగి: మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కోసిగిలోని ఆర్‌సీఎం, క్రీస్తుసంఘం, సీఎస్ఐ, ఏసుకృపా ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఆయా చర్చిలలో దైవ జనులు పాస్టర్లు రాజారత్నం, దేవరాజు, ప్రేమ్‌కుమార్, ఫాదర్ టోనీ, దేవపుత్ర, శ్రీను, చిదానంద, ప్రకాశంలు బైబిల్‌లో ఏసుక్రీస్తు చెప్పిన అంశాలను వివరించారు. అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

ఎమ్మిగనూరుటౌన్: క్రిస్మస్ వేడుకలను పట్టణంలో బుధవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చీల్లో ఉదయం నుంచే క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రెవరెండ్ పాస్టర్ జయన్న క్రీస్తు జన్మ వృత్తాంతంతో పాటు ఏసు బోధనలను వినిపించారు. స్థానిక ఆర్‌సీఎం, సీఎస్ఐ1, 2 చర్చి ప్రార్థనా మందిరాల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠలు క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, మాజీ మున్సిపల్ చైర్మన్‌బుట్టారంగయ్య, కౌన్సిలర్లు కామర్తినాగేషప్ప, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకె శివప్రసాద్, మహబుబ్‌బేగ్ ,దారాల శ్రీను, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు ఆర్‌సీఎం చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

గోనెగండ్ల : పెద్దనేలటూర్, గోనెగండ్ల, హెచ్ కైరవాడి, వేముగోడు, కులుమాల, గంజిహళ్లి, గాజులదిన్నె, పెద్దనేలటూర్, వేముగోడు, పెద్దమరివీడు, చిన్నమరివీడు, అలువాల తదితర గ్రామాలలో చర్చి సంఘ పెద్దలు, పాస్టర్ల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం అర్థరాత్రి నుంచే చర్చీల్లో ప్రార్థనలు మొదలయ్యాయి. బుధవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రార్థనలు, ఆరాధన, పాటలు నిర్వహించారు. గోనెగండ్లలో ఎఫ్రాత ప్రార్థన మందిరం, క్రీస్తు సంఘాలలో దైవ సేవకులు యదిద్య రాజు, జీకే పాల్, ఓనేసీమ్, ప్రసంగి దైవ సందేశం వినిపించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

క్రీస్తు మార్గంలో నడిచినప్పుడే సమాజంలో శాంతి



కౌతాళం సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

కౌతాళం: క్రిస్మస్ వేడుకలు బుధవారం మండల కేంద్రమైన కౌతాళంతో పాటు వివిధ గ్రామాలలో ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచే పండుగ వేడుకలను క్రైస్తవ సోదరులు వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి చర్చీకు చేరి ప్రార్థనలు చేపట్టారు. ఉదయం పది గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలను చేశారు. కౌతాళంలో పాస్టర్ ఇమ్మానియల్, సతీష్, ఉరుకుందలో ఆనందకుమార్ మాట్లాడుతూ ఏసు ప్రభువు చూపిన బాటలో నడిచినప్పుడే సమాజంలో శాంతితో పాటు సోదరభావం పెరుగుతుందన్నారు. ఏసు చూపిన మార్గంలో పయనించిన వారు ఎప్పటికి విఫలం కారని వారికి విజయం వెంటే ఉంటుందన్నారు. సాయంత్రం ప్రత్యేక సాంస్కృతి కార్యక్రమాలను నిర్వహించి వారికి బహుమతులు ప్రదానం చేశారు. కౌతాళంతో పాటు హల్విలో చూడిలో, కామవరంలో, కాత్రికిలో ప్రార్థనలు జరిపారు.



క్రీస్తు సందేశాన్ని బోధిస్తున్న రెవరెండ్ జీవన్‌బాబు

నందవరం : మండలంలోని నందవరం సీఎస్ఐ చర్చి, నాగలదిన్నె ఎంబీ చర్చి, మిట్టసోమపురంలో ఎంబీ చర్చి, ముగతి, కనకవీడు, గురజాల, కొత్తకైరవాడి, గంగవరంలో చర్చీల్లో ఫాదర్లు యేసు జనన చరితను వినిపించారు. భక్తి గేయాలను ఆలపించారు. ఆయా గ్రామాల్లోని చర్చీల్లో రెవరెండ్ ఫాదర్లు ప్రసాద్, యేహాన్, జీవన్‌బాబు, పురుషోత్తం, సామ్యూల్ నాయక్‌లు ప్రభు వాక్యాలను, శాంతి సందేశాలను వినిపించారు. వేడుకల్లో జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, ఆయా చర్చి సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి

- తగ్గుతున్న ఉష్ణోగ్రతలు
- 16 డిగ్రీలకు పడిపోయిన వైనం
- ఉదయం 8గంటలైనా తగ్గని చలి
- తగు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



రహదారిపై కమ్ముకున్న పొగమంచు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్వెట్టర్లు

ఆదోని సెంట్రల్: చలి తన పంజా విసురుతోంది. వేకువ జామున ఊరి బయట మంచు కప్పేస్తోంది. స్వెటర్లు, మంకీ క్యాపు పెట్టుకున్నా చలి వదలడం లేదు.. వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు కూడా గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 16, 17 డిగ్రీలకు పడిపోయాయి. ఉదయమే పాఠశాలకు, కళాశాలకు వెళ్లే విద్యార్థుల నుంచి ఉద్యోగాలకు ఆయా పనులకు వెళ్లే జనంతో పాటు వృద్ధులు, చిన్నారులు తగు జాగ్రతలను తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు చెబుతున్నారు.

పెరుగుతున్న చలి గాలులు

రోజు రోజుకు చలిగాలులు పెరుగుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత తగ్గుముఖం పడుతోంది. వాతవరణంలో ఏర్పడిన మార్పులు, తుపాను ప్రభావం వలన చల్లటి గాలులు వీస్తున్నాయి. దీంతో జనం గజగజ వణుకుతున్నారు. చీకటి పడితే ఉష్ణోగ్రతలు మరింత తగ్గు ముఖం పడుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకైనా చలి తగ్గడం లేదు. చలి గాలుల నుంచి ఉపశమనం పొందేందుకు కొందరు చలిమంటలను వేసుకుంటున్నారు. మరి కొందరు స్వెటర్లు, మంకీ క్యాపులు ధరిస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ముందు ముందు ఏలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉన్ని దుస్తులు ధరిస్తే మంచిది

చలి పెరగడంతో ఉన్ని దుస్తులు ధరిస్తే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. పట్టణంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్ ప్రాంతాల నుంచి వ్యాపారులు ఉన్ని దుస్తులు విక్రయించే దుకాణాలను ఏర్పాటు చేశారు. పిల్లల దగ్గర నుంచి వృద్ధులు వరకు ఉన్ని దుస్తులను కనుగోలు చేసి ధరించేందుకు ప్రయత్నిస్తున్నారు. వ్యాపారులు కూడా పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, రహదారులో తాత్కాలిక షెడ్లను వేసుకొని విక్రయాలు చేస్తున్నారు. ఈ దుకాణాల్లో స్వెటర్లతో పాటు మంకీ క్యాప్‌లు, రగ్గులు అమ్మకానికి ఉంచారు. ధరలు కూడా అందుబాటులో ఉండటంతో పేద మధ్య తరగతి వారు వాటిని కనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. గుండె సంబంధిత వ్యాధులతో పాటు జ్వరం, దగ్గు సమస్యలు ఉన్నవారు వెచ్చని వాతవరణంలో ఉండే విధంగా చూసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. వృద్ధుల నుంచి చిన్నారులతో పాటు అన్ని వయసులు వారు బయటికి వెళ్లేటప్పుడు స్వెటర్లు, జర్కిన్, మంకీ టోపీలు ధరించుకుంటే మంచిదని చెపుతున్నారు.

ఘనంగా గ్రామదేవతల దేవర



చింతకుంటలో కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, బాలికలు



కొల్మాన్‌పేటలో గ్రామ దేవత మారెమ్మ దేవిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డి



పూజలందుకుంటున్న మారెమ్మదేవి, సుంకులమ్మదేవి

కోసిగి: మండలంలోని సాతనూరు, అగసనూరు, దుద్ది, కొల్మాన్‌పేట, వందగల్లు, జుమ్మాలదిన్నె, గొడుగల్లు, చింతకుంట గ్రామాల్లో గ్రామ దేవతలు మారెమ్మ దేవి, దేవమ్మ దేవి దేవర ఘనంగా నిర్వహించారు. బుధవారం వేకువజామున నుంచి ఆయా గ్రామాల్లో దేవతల విగ్రహాలను పురవీధుల గుండా మేళతాళాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయంలో కొలువుదీర్చారు. గ్రామ దేవతకు కుంకుమార్చన, ఆకు పూజ వెండి కవచ అలంకరణలు, మహా మంగళహారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి పూర్ణకుంభాల్లో నైవేద్యం తయారు చేసి కలశాలను ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి తరపున వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, మండల నాయకులు నాడుగేని నాగరాజు, మహంతేష్ స్వామి, ఆయా సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు. దేవర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కనుల పండువగా ఉత్సవాలు

కౌతాళం: మండల పరిధిలోని చూడి, కరణి, తిప్పలదొడ్డి, గుడికంబాలి, మేళిగనూరు, కాత్రికి గ్రామాల్లో దేవర మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. బుధవారం తెల్లవారు జామున 2గంటలకు మేటి కుంభానికి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అంతకుముందు దేవాలయాల్లో ఆకుపూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలతో ఉత్సవంను ప్రారంభించారు. భక్తులు కుంభాలతో ఊరేగింపుగా తరలివచ్చి మారెమ్మఅవ్వ, సుంకులమ్మ దేవి దేవాలయాల్లో పూజాలు నిర్వహించారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ప్రారంభమైన కుంభోత్సవ కార్యక్రమం మధ్యాహ్నం వరకు కొనసాగింది. భక్తులు వేలాదిగా తరలిరావడంతో గ్రామాల్లోని అన్ని ప్రధాన వీదులు కిటకిటలాడాయి.

ప్రజలకు షాకిచ్చిన ప్రభుత్వం

- రేపు వైఎస్సార్‌సీపీ పోరుబాటను జయప్రదం చేయండి
- పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించిన పార్టీ నాయకులు



పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలను పెంచి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు షాకిచ్చిందని వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, పార్టీ వీరశైవ లింగాయత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి అన్నారు. విద్యుత్ చార్జీల బాదుడుపై ఈనెల 27న వైఎస్సార్‌సీపీ పోరుబాటపై స్థానిక పార్టీ కార్యాలయం ఆవరణలో బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.15,485 కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిందని మండిపడ్డారు. ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వ చర్యలును నిరసిస్తూ శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలు దేరి విద్యుత్ ఉపకేంద్రం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్నాకు పార్టీ శ్రేణులు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ముగతి విరూపాక్షిరెడ్డి, సునీల్‌కుమార్, శాప్‌నెట్‌వర్క్ మాజీ చైర్మన్ మాచాని వెంకటేష్, మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి, నాగేష్ నాయుడు, ఎంకే శివప్రసాద్, కామర్తి నాగేషప్ప, బజారి, అబ్రార్, మాబాషా, అల్తాఫ్, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

రైలు నుంచి కిందపడిన విద్యార్థిని



రెలు పట్టాల పక్కన పడిన హరిత

బత్తలపల్లి: తిరుపతి – గుంతకల్లుకు ప్రయాణిస్తున్న రైలు నుంచి ఓ విద్యార్థిని ప్రమాదవశాత్తు కిందపడింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఆమెను కాపాడారు. ఆర్‌పీఎఫ్ సీఐ బోయ కుమార్ తెలిపిన వివరాల మేరకు... కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన బోయ నాగరాజు కుమార్తె బోయ హరిత అన్నమయ్య జిల్లా మదనపల్లి వద్ద ఉన్న కలికిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. క్రిస్మస్ సెలవులు రావడంతో బుధవారం తన సోదరుడు గిరిబాబుతో కలసి స్వ గ్రామానికి వెళ్లడానికి గుంతకల్లు ప్యాసింజర్ రైలు ఎక్కారు. వీరు ప్రయాణిస్తున్న రైలు ముదిగుబ్బకు చేరగానే హరిత వాష్‌రూంకు వెళ్లింది. ఎంతసేపటికీ ఆమె రాకపోవడంతో అనుమానం వచ్చిన సోదరుడు రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. ఆమె వద్దనున్న ఫోన్ సిగ్నల్ ఆధారంగా బత్తలపల్లి మండలం చిన్నేకుంటపల్లి–డి.చెర్లోపల్లి గ్రామాల మధ్య రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సెక్షన్‌లోని ఆన్ డ్యూటీ కీమెన్ మస్తాన్‌ను అప్రమత్తం చేయడంలో ఆయన అక్కడికు పరిశీలించారు. సమాచారం అందుకున్న ధర్మవరం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన హరితను 108 అంబులెన్స్‌లో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు కింద పడిపోయినట్లు ప్రాథమిక విచారణ తేలింది. ప్రస్తుతం ప్రాణాపాయం నుంచి ఆమె బయటపడినట్లు ఆర్డీటీ వైద్యులు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఆలూరు రూరల్: కూటమి ప్రభుత్వం యూజర్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి,ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు, మండల నాయకుడు షాకీర్ అన్నారు. బుధవారం కరెంటు చార్జీలు తగ్గించాలంటూ ఆలూరులోని అంబేడ్కర్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ.. అధికారం చేపట్టక ముందు విద్యుత్ చార్జీల పెంచబోమని చెప్పిన కూటమి నేతలు అదనపు చార్జీల పేరుతో చార్జీలు పెంచడం దారుణమన్నారు. దీంతో పేద మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడిందన్నారు.నాయకులు కృష్ణ, నాగరాజు, వీరేష్ పాల్గొన్నారు.